క్లుప్తంగా

రోడ్డుపై ఆక్రమణలు తొలగించండి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

చిత్తూరు అర్బన్: నగరంలోని షర్మన్ పాఠశాల సమీపం నుంచి పీసీఆర్ కూడలి వరకు జరుగుతున్న స్మార్ట్ రోడ్డు పనులను శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద పరిశీలించారు. అనంతరం స్మార్ట్ పనులకు ఎక్కడా ఆటంకం లేకుండా చూడాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. రోడ్డుపై ఉన్న ఆక్రమణలను సైతం తొలగించాలన్నారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నగర కన్వీనర్ టిమ్ స్టీఫెన్ తదితరులు ఉన్నారు.

గుట్టలో గోవింద నామస్మరణ

చిత్తూరు రూరల్: గోవిందరాజుల గుట్ట గోవింద నామస్మరణలతో మార్మోగింది. గుట్ట భక్తుల సందడితో నిండిపోయింది. పెరటాసి నెలను పురస్కరించుని చిత్తూరు మండలం టి.వేపనపల్లిలోని గోవిందరాజులగుట్టలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో తరలివచ్చి శ్రీవారి పాదానికి అభిషేక పూజలు చేశారు. భజనలు, కోలాటాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు యూనిఫామ్ అందజేస్తున్న సర్పంచ్ ఉమాదేవి

బంగారుపాళెం: బంగారుపాళెం మేజర్ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు శనివారం సర్పంచ్ ఉమాదేవి యూనిఫాం, పాదరక్షలు, సోపులు, నూనె అందజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు కార్మికులు కృషి చేస్తున్నారన్నారు. ఉపసర్పంచ్ కామరాజు కార్మికులకు స్టీల్ ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉషారాణి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు శంకరయ్య, అవంతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చిత్తపారలో వైద్యశిబిరం



గ్రామంలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతి

గుడిపాల: మండలంలోని చిత్తపార గ్రామంలో కలుషిత ఆహారంతో ఏడుగురికి అస్వస్థతకు గురవడంతో శనివారం డీఎంహెచ్‌ఓ ప్రభావతి చిత్తపార గ్రామాన్ని సందర్శించారు. చిత్తపారలో కర్మక్రియలకు హాజరై అస్వస్థతకు గురైన ఇళ్లను ఆమె పరిశీలించారు. ఇంకా ఎంతమంది కర్మక్రియల్లో పాల్గొన్నారో వారి సమాచారాన్ని సేకరించారు. అక్కడే వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ చిత్తపార గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశామని, ఇది మూడు రోజుల పాటు ఉంటుందని చెప్పారు. ఆమెతో పాటు వైద్యసిబ్బంది వాణి, మోహన్‌శెట్టి, హేమ, సంధ్య, నరసింహమూర్తిలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వద్దు

పూతలపట్టు: జగనన్న లే అవుట్‌లోని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహించకూడదని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని పి.కొత్తకోట జగనన్న లేఅవుట్లను శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ మొత్తం 50 ఇళ్లు మంజూరైతే వాటిలో 37 మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి ఎందుకు పూర్తిచేయలేదని ఆరాతీశారు. రెండు వారాల్లో పనులు పూర్తిచేయకపోతే పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక సర్పంచ్‌తో మాట్లాడుతూ ప్రతిరోజు లబ్ధిదారులతో మాట్లాడి వారితో నిర్మాణ పనులను పూర్తిచేయాలని సూచించారు. వలంటీర్లు వారి పరిధిలోని లబ్ధిదారులకు గుర్తు చేస్తుండాలని తెలిపారు. సర్పంచ్ పద్మజారాణి, పంచాయతీ కార్యదర్శి జరీనా, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ఆర్డీఓ



ఆర్డీఓ చిన్నయ్యకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని చిత్తూరు నూతన ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన చిన్నయ్య శనివారం రాత్రి దర్శించుకున్నారు. రాత్రి ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో స్వామివారి చిత్రపటం తీర్థ ప్రసాదాలు అందించారు.

ఐరాల: సరస్వతిదేవిగా పాలేటమ్మ, గుడిపాల: బాలత్రిపురసుందరీ దేవిగా పల్లూరుగంగమ్మ, బంగారుపాళెం: శ్రీదుర్గాదేవిగా ముత్యాలమ్మ





అలంకార వైభవం.. నవరాత్రి ఉత్సవం

కాణిపాకం(యాదమరి): అమ్మవారు రోజుకో అలంకారంతో దర్శనమిస్తున్న నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కాణిపాకం మణికంఠేశ్వర స్వామి ఆలయంలో శనివారం అమ్మవారు కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. కాళికామాత ఆలయంలో లలితాదేవిగా, యాదమరి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతీ దేవి అలంకరణలో పూజలందుకున్నారు.

మహిషాసుర మర్దినిగా దుర్గాంబ

చిత్తూరు రూరల్: చిత్తూరు గిరింపేటలో వెలసిన శ్రీదుర్గాంబ దేవస్థానంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు అభయమిచ్చారు. శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో కంచి కామాక్షిగా, ముత్యాలమ్మ ఆలయంలో సంతానలక్ష్మిగా, సాయిబాబా ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకారంలో కటాక్షించారు.



చిత్తూరు: సంతానలక్ష్మిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం: గ్రామదేవత ముత్యాలమ్మను శ్రీదుర్గాదేవిగా, వజ్రాలపురం బోయకొండ గంగమ్మను దుర్గామాతగా అలంకరించారు.

గుడిపాల: మండలంలోని కందగిరి కొండవద్ద ఉన్న మూలస్థాన దుర్గమ్మ మహిషాసురమర్దినిగా, పల్లూరు గంగమ్మ బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ఐరాల: స్థానిక పాలేటమ్మ దేవాలయంలో సరస్వతీదేవి అలంకరణలో, వైఎస్ గేటులోని ఛాముండేశ్వరి అమ్మ వారి ఆలయంలో లలితత్రిపుర సుందరిగా పూజలందుకున్నారు.






యాదమరి: సరస్వతిగా కన్యకా పరమేశ్వరి, చిత్తూరు: లలితాదేవిగా, కాణిపాకం: కాత్యాయనిగా మరగదాంబికాదేవి, గుడిపాల: మహిషాసురమర్దినిగా..

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- స్పందన అర్జీల పరిష్కారంపై దృష్టి
- బాధ్యతలు స్వీకరించిన చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య

చిత్తూరు కలెక్టరేట్ : అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వనున్నట్లు నూతన ఆర్డీవో చిన్నయ్య అన్నారు. ఆయన శనివారం చిత్తూరు ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ అసోసియేషన్, వీఆర్వో అసోసియేషన్, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. చిత్తూరు జిల్లా తనకు సుపరిచితమేనన్నారు. 2009లో తిరుపతి అర్బన్ తహసీల్దార్ గా పనిచేసినట్లు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్‌గా ఎక్కువ కాలం వైఎస్సార్ కడప జిల్లాలో పని చేసినట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో డిప్యూటీ కలెక్టర్ కేడర్‌లో పనిచేసి బదిలీపై చిత్తూరు ఆర్డీవోగా విచ్చేసినట్లు చెప్పారు. ప్రజలు తనను నేరుగా కలిసి తమ సమస్యలు వెల్లడించుకోవచ్చన్నారు. చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. ప్రత్యేక ప్రణాళికతో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవోను ఏవో రామాంజులునాయక్, జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షులు అమరనాథ్, వీఆర్వో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలాజీరెడ్డి, పద్మనాభం, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీవో చిన్నయ్య

జేసీని కలిసిన ఆర్డీవో చిన్నయ్య

చిత్తూరు ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన చిన్నయ్య జేసీని కలిశారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాసేపు రెవెన్యూ సంబంధిత అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వే, స్పందనలో నమోదయ్యే రెవెన్యూ అర్జీల పరిష్కారం తదితర అంశాలపట్ల ప్రత్యేక దృష్టితో పని చేయాలని ఆర్డీవోను జేసీ ఆదేశించారు.

అర్జీలు పరిష్కరించకపోతే చర్యలు

యాదమరి: 'జగనన్నకు చెపుదాం' కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పరిష్కరించకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ హనుమంతు నాయక్ వీఆర్‌ఓలను హెచ్చరించారు. ఆయన శనివారం సాయంత్రం వీఆర్‌ఓలకు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 6న ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 196 అర్జీలు వచ్చాయి. వాటిల్లో ఎన్ని పరిష్కరించారని ప్రశ్నించారు. ఎవరూ సరైన సమాధానాలు చెప్పలేదు. దీంతో జాయింట్ కలెక్టర్ 15 రోజుల్లో అర్జీలను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంత వరకు పట్టించుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. వీఆర్వోలందరూ వారి పరిధిలోని అర్జీలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ విలేకర్లతో మాట్లాడుతూ జగనన్నకు చెపుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పరిష్కరిస్తామని వివరించారు.

జవాబుదారీతనంతో వ్యవహరించాలి

ఐరాల: జగనన్నకు చెబుదాం వచ్చిన వినతులపై జవాబుదారీతనంతో వ్యవహరించాలని మండల అధికారులను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ సుశీల, ఎంపీడీఓ నాగరాజుతో కలసి ఇటీవల నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికే మన ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించిందని, ప్రజలకు సేవకు ఉపయోగించాలి తప్ప స్వార్థ ప్రయోజనాలకు వినియోగించడం మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కారానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిష్కారం కాకపోతే సంబంధిత అర్జీదారుకు లేఖ ద్వారా తెలియచేయాలన్నారు. మండల స్థాయిలోనే ప్రజాసమస్యలను పరిష్కరించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలపై సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

పేదల ఆరోగ్యానికి భద్రత




గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, హాజరైన ప్రజలు

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 10వ వార్డు సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే, మేయర్ అముద పరిశీలించారు. ఐసీడీఎస్, డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, వైద్యాధికారులు, నగర పాలక అధికారులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని గుడిపాల సచివాలయ ఆవరణలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరయ్యారు. మందులు, కంటి అద్దాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, డెప్యూటీ తహసీల్దార్ కళ్యాణి, వైద్యులు రష్మిత, హరి, శేషగిరి, ప్రీతి, వైఎస్సార్ సీపీ నాయకులు రజనీకాంత్, శిలంబరసన్, వెంకటేశులురెడ్డి, గుండుసాయి, సాయిక్రిష్ణలతో పాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

350 మందికి వైద్య సేవలు

బంగారుపాళెం: మండలంలోని ఈచనేరిపల్లెలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ అనూరాధ, ఎంపీటీసీ సభ్యుడు కవిత, ఎంపీపీ అమరావతి ప్రారంభించారు. 350 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందుల పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు.

సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

తవణంపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ కోరారు. మండలంలోని జొన్నగురకలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు 365 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ముగిసిన ఆరోగ్య సురక్ష

పూతలపట్టు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఎంపీడీఓ గౌరి అన్నారు. మండలంలోని యం.బండపల్లి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన శిబిరంలో 493 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు.



పూతలపట్టు: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ప్రదర్శిస్తున్న అధికారులు, నాయకులు